# సాక్షి ప్రకాశం

ఆదివారం । 1 । డిసెంబర్ । 2024





**అవగాహనే ఆయుధం**

జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో ఎయిడ్స్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. పది వేల మందికిపైగా ఎయిడ్స్ బాధితులు ఉన్నారు.

- 8లో..



**అక్రమ కేసులు బనాయించడం సరికాదు**

వైఎస్సార్ సీపీ వర్గీయులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
27/23

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### డైట్ ప్రిన్సిపాల్‌గా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ


సుబ్బారావు

**ఒంగోలు సిటీ:** మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.సుబ్బారావు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఒంగోలు డిప్యూటీ డీఈఓగా సుబ్బారావు పనిచేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సుబ్బారావుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేస్తామన్నారు. రాష్ట్రంలోనే డైట్ కాలేజికి మంచి ప్రాధాన్యత ఉందన్నారు. నాతోపాటు సహచర లెక్చరర్లు డైట్ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు.

### ప్రపంచ ఎయిడ్స్ డే ర్యాలీ నేడు

**ఒంగోలు టౌన్:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టర్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ భవనం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డా.పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ , ఎయిడ్స్ నియంత్రణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రారంభిస్తారని తెలిపారు. ఎయిడ్స్, హెచ్ఐవీ వ్యాధుల గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు మీకు తెలుసా అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 2 వేల మంది విద్యార్థులకు హెచ్ఐవీ నియంత్రణ, నివారణ, జీవన నైపుణ్యం గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

### డీఎస్సీ మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**ఒంగోలు వన్‌టౌన్:** డీఎస్సీ 2024కు హాజరయ్యే మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి బీ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ అభ్యర్థులు ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు రాష్ట్రంలోని ప్రముఖ శిక్షణ సంస్థలతో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ీటీీ్ప ఇఖ్చి ఛీఝఝఛీీఛీ.ూటజ అనే పోర్టల్ ద్వారా లేదా మైనార్టీల విద్యా అభివృద్ధి కేంద్రం, స్వాతి థియేటర్ ఎదురుగా, భవానీపురం, విజయవాడ అనే చిరునామాలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు 0866 2970567 అనే నంబరులో సంప్రదించాలన్నారు. ప్రైవేటు శిక్షణ సంస్థలు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

### తుఫాన్ ప్రభావం స్వల్పం


- ఎనిమిది మండలాల్లో కొద్దిపాటి వర్షపాతం
- సరాసరి వర్షపాతం 0.9 మి.మీ



**ఒంగోలు అర్బన్:** జిల్లాపై ఫెంగల్ తుఫాన్ ప్రభావం స్వల్పంగానే ఉంటుందని అధికారులు తెలిపారు. పెద్దగా వర్షాలు లేకపోయినా చలిగాలులు వీస్తున్నాయి. జిల్లాలో ఎనిమిది మండలాల్లో కొద్దిపాటి వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి వర్షపాతం 0.9 మి.మీటర్లు నమోదైంది. అత్యధికంగా సింగరాయకొండ మండలంలో 8.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా జరుగుమల్లిలో 8.6, కొత్తపట్నం 6.4, ఒంగోలు 4.2, మద్దిపాడు 1.8, నాగులుప్పలపాడు, సంతనూతలపాడుల్లో 1.6 మి.మీ, కొండపి మండలంలో 0.8 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది.

**టీడీపీ నేతలు** బరితెగించారు. దేవదాయశాఖ భూములు దర్జాగా ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. ఆ శాఖాధికారులను అటువైపు కన్నెత్తి కూడా చూడొద్దని, ఆపడానికి ప్రయత్నం చేయొద్దని ముందుగానే హెచ్చరించారు. దాదాపు రూ.20 కోట్ల విలువైన స్వామి వారి ఆస్తిని కాజేస్తున్నా.. జిల్లాకు చెందిన మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దేవుడి భూములు ఆక్రమిస్తే మట్టి కొట్టుకుపోతారని శాపనార్థాలు పెడుతున్నారు.

- లక్ష్మీ నృసింహస్వామి ఆస్తులకు ఎసరు
- దేవదాయశాఖ భూముల్లో పచ్చనేతల శాశ్వత కట్టడాలు
- రూ.20 కోట్ల విలువ చేసే భూములు అన్యాక్రాంతం
- అధికారులను బెదిరిస్తున్న అధికార పార్టీ ఎమ్మెల్యే
- చోద్యం చూస్తున్న దేవదాయశాఖ అధికారులు
- మంత్రి డోలాకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు



హే..నృసింహా

# నీ భూమికి దిక్కేది?

**మర్రిపూడి:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవుని భూములకు రక్షణ కరువైంది. కోట్ల రూపాయల విలువ చేసే స్వాములవారి సొత్తుస్వాహా అవుతుంటే అధికారులు మిన్నకుండిపోతున్నారు. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పృధులగిరి లక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఒకటి. ఇది మర్రిపూడి మండలం, మర్రిపూడి గ్రామానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. 19 వ శతాబ్దంలో వెంకటగిరి రాజులు పృధుల సీమను పరిపాలిస్తున్న రోజుల్లో ధూపదీప నైవేద్యాలు చేసేందుకు 136 ఎకరాల (మాన్యం) భూమిని దానం చేశారు. ఎంతో విలువైన ఈ భూములు కనిగిరి, మర్రిపూడి, పొదిలి, కొనకనమిట్ల మండలాల్లోని 15 గ్రామాల్లో ఉన్నాయి. పొదిలిలోని ఖాతా నంబరు 1491, సర్వే నంబరు 424–2 లో 3.26 ఎకరాల భూమి ఉంది. ఇటీవల కాలంలో ఈ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం ఆ భూమి విలువ సుమారు రూ.20 కోట్లు ఉంటుంది. ఈ భూమిపై అధికార పార్టీ నేతల కన్ను పడింది.

ఎలాగైనా ఆక్రమించాలని పథకం పన్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అండదండలతో భూమి స్వాహాకు సిద్ధమయ్యారు. గో సంరక్షణసేవా సంఘం పేరుతో భూములను ఆక్రమించుకున్నారు. దేవదాయశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దంటూ దేవదాయశాఖ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడిలు వస్తున్నట్టు సమాచారం.


పొదిలిలోని ఎండోమెంట్ భూమిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు

### పట్టించుకోవేమి స్వామీ..

ఈ ప్రముఖ దేవాలయం కొండపి నియోజకవర్గ పరిధిలో ఉంది. కోట్ల రూపాయల విలువైన లక్ష్మీనృసింహస్వామి భూములను కాపాడాలని భక్తులు సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోల బాలవీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకెళ్లారు. రెండు నెలల కిందటే సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లినా కట్టడాలను అడ్డుకున్న దాఖలాలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన నియోజకవర్గ పరిధిలోని ఆలయానికి సంబంధించిన భూమి అన్యాక్రాంతం అవుతున్నా మంత్రి పట్టించుకోకపోవడం సరికాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### అధికారులకు బెదిరింపులు

''ఈ భూముల్లో నిర్మిస్తున్న కట్టడాల వద్దకు మీరు వెళ్లకూడదు. కట్టడాలు ఆగకూడదు. కనీసం అటు తొంగి కూడా చూడొద్దు'' అంటూ ఎండోమెంట్ అధికారులకు ఎమ్మెల్యే నుంచి హెచ్చరికలు వచ్చినట్టు తెలిసింది. అయితే అధికారులు మాత్రం మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి మిన్నకుండిపోయారు. నిర్మాణాలు సాగుతున్నా అధికార పార్టీ నేతలకు భయపడి ఆపే ప్రయత్నం చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవుడు భూములు యథేచ్ఛగా అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునేవారు లేరా? అని లక్ష్మీనృసింహస్వామి భక్తులు వాపోతున్నారు.

**దేవుని భూములనైనా వదలండి నాయనా...**



పృథులగిరి లక్ష్మీ నృసింహస్వామి ఆలయ భూములు మర్రిపూడి, కనిగిరి, పొదిలి, కొనకనమిట్ల మండలాలల్లోని 15 గ్రామాల్లో 136 ఎకరాల ఎండోమెంట్ భూమి ఉంది. ఎంతో విలువైన ఈ భూములు యథేచ్ఛగా అన్యాక్రాంతం అవుతున్నాయి. పొదిలిలో ఎలాంటి అనుమతులు లేకుండా దేవుని భూముల్లో శాశ్విత కట్టడాలు కడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. స్వాములోరు భూములను కాపాడండయ్యా.

– బాలసాని మాలకొండారెడ్డి,
మర్రిపూడి, లక్ష్మీ నృసింహస్వామి ఆలయ కమిటీ మాజీ సభ్యుడు

**అక్రమ కట్టడాలపై నోటీసులిచ్చాం..**



లక్ష్మీ నృసింహ స్వామి ఎండోమెంట్ భూమిలో ఎలాంటి అనుమతులు లేని అక్రమ కట్టడాలు కట్టినమాట వాస్తవమే. సర్వే నెంబర్లు 424–2లోని 3.26 ఎకరాల భూమిలోని అక్రమ కట్టడాలపై 83 సెక్షన్ కింద నోటీసులు ఇచ్చాం. 15 రోజుల్లో తొలగించకపోతే, పోలీస్‌ల సహకారంతో అక్రమ కట్టడాలను కూల్చివేస్తాం.

– లీలాకృష్ణ, ఎండోమెంట్ కార్యనిర్వహణాధికారి, పొదిలి

# సేవ్ టీడీపీ, సేవ్ యర్రగొండపాలెం

- తారాస్థాయికి చేరిన గ్రూపు తగాదాలు
- అమరావతి తరలి వెళ్లిన ఎరిక్షన్‌బాబు వ్యతిరేక వర్గీయులు


అమరావతి తరలి వెళ్తున్న ఎరిక్షన్‌బాబు వ్యతిరేక వర్గీయులు

**పెద్దదోర్నాల:** యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీలో గ్రూపు తగాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ''సేవ్ టీడీపీ..సేవ్ యర్రగొండపాలెం'' నినాదంతో పలువురు నాయకులు శనివారం రాష్ట్ర రాజధాని అమరావతి బాట పడ్డారు. యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఎరిక్షన్‌బాబు వ్యవహార శైలిపై రెండు వారాల కిందట అమరావతికి వెళ్లి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసి వచ్చారు. అయినా పై నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో తిరిగి శనివారం ఆయన వ్యతిరేక వర్గం మరో మారు అమరావతి బాట పట్టింది. పలువురు నేతలు, కార్యకర్తలు ప్రత్యేక వాహనంలో పార్టీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నాయకులు విడతలవారీగా వెళ్లి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా శనివారం పెద్దదోర్నాల మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు రాజధానికి తరలివెళ్లారు. ఎరిక్షన్ బాబు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులను పట్టించుకోకుండా తన అనుకూల వర్గానికే పనులు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పార్టీలో తమకు న్యాయం జరగటం లేదని, ఎన్నో ఏళ్లగా పార్టీని అంటిపెట్టుకున్న తమను కాదని, కొత్తగా మాయమాటలు చెప్పే వారికి ఎరిక్షన్‌బాబు పనులు చేస్తున్నారన్న ఆరోపణలను గుప్పిస్తున్నారు. అలాగే కొందరు రాజకీయ నాయకులకు మాత్రమే ఎరిక్షన్‌బాబు అందుబాటులో ఉండి వారికి మాత్రమే పనులు చేసి పెడుతున్నారని వారు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో పార్టీని బతికించాలని కోరుతున్నామని వారు పేర్కొంటున్నారు. అమరావతిలో వారు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు, పలువురు నాయకులను కలిసి నియోజకవర్గ సమస్యలను వారి దృష్టిలో పెట్టినట్లు సమాచారం.



# స్మార్ట్ మీటర్లు వద్దు

- గతంలో బాదుడే..బాదుడు అని ప్రచారం చేసిన కూటమి నేతలు
- అధికారంలోకి రాగానే ప్రజలపై విద్యుత్ రూపంలో భారం
- సీపీఎం ఆధ్వర్యంలో డీ–3 విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా



విద్యుత్ ఒంగోలు డీ-3 సబ్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

**ఒంగోలు సబర్బన్:** విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టవద్దంటూ ఒంగోలు నగర సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. స్థానిక పాత గుంటూరు రోడ్డులోని విద్యుత్ డీ–3 సబ్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాకు సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు తంబి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ధర్నాను ఉద్దేశించి నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో స్మార్ట్ మీటర్లు బిగించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిరచటం అన్యాయమన్నారు. షాపు యజమానుల అనుమతి లేకుండా బిగిస్తున్నారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల్లో భాగంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం పూనుకోవటం మానుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చు రూ.13 వేల నుంచి రూ.30 వేలు ఉంటుందని, అందుకుగాను 96 నెలల్లో వాయిదాల పద్ధతిలో బిల్లులో కలిపి చెల్లించే టెక్నాలజీ విద్యుత్ స్మార్ట్ మీటర్లలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రీపెయిడ్ లాగా, ఫోన్ రీఛార్జ్ మాదిరిగా కరెంటుకు కూడా ముందుగానే రీచార్జ్ చేయించుకోవాలన్నారు. రీచార్జి అయిపోగానే విద్యుత్ ఆగిపోతుందని ఎప్పుడు ఆగిపోతుందో తెలియదని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. ప్రజల మీద రూ.9,114 కోట్ల భారం మోపుతున్నారని, ఇంత భారం ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. గతంలో బాదుడే.. బాదుడు అని ప్రచారం చేసిన కూటమి పెద్దలు నేడు అధికారం లోకి వచ్చి అదే బాదుడే.. బాదుడు కార్యక్రమం చేపట్టారని ధ్వజమెత్తారు. ఈ బాదుడే...బాదుడు కార్యక్రమాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరీం, షేక్ గౌస్ బాషా, షేక్ మౌలాలి, సయ్యద్ రియాజ్, షేక్ ఖాదర్ బాషా, మాదర్ వలి, అల్లాభక్షుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం

- 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్, ఎంపీ మాగుంట


సమావేశంలో మంత్రి డోలా, ఎంపీ మాగుంట, లంకా దినకర్, జేసీ గోపాలకృష్ణ

**ఒంగోలు అర్బన్:** జిల్లాను అభివృద్ధి చేసేందుకు అందరినీ కలుపుకుని సమష్టిగా కృషి చేస్తామని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. స్థానిక ప్రకాశం భవనంలో పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఏపీ 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. దీనిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దనరావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. లంకా దినకర్ మాట్లాడుతూ లఖపతి దీదీ పథకం ద్వారా జిల్లాలో లక్షా ఇరవై వేల మంది లఖ్‌పతి దీదీలు ఉన్నట్లు తెలిపారు. మరో లక్ష మందిని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెంచేలా కేంద్రం దృష్టి సారించిదన్నారు. సూర్యఘర్ పథకాన్ని జిల్లాలో 5 లక్షల ఇళ్లకు విస్తరించనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద అవసరమైన సామగ్రిని స్థానిక సరఫరాదారుల నుంచి సమకూర్చుకునేలా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ కింద మంజూరయ్యే పనులు గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ జాతీయ రహదారులకు సంబంధించి ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్‌పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ ఓబులేసు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, సీపీఓ వెంకటేశ్వరరావు, మేయర్ సుజాత ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కోర్టు భవనాలు పరిశీలించిన హైకోర్టు జడ్జి


కోర్టు పనులను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి కే మన్మథరావు

**సింగరాయకొండ:** స్థానిక మండల కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పనులను శనివారం హైకోర్టు న్యాయమూర్తి కే మన్మథరావు ఆకస్మిక తనిఖీ చేశారు. కోర్టు ఏర్పాటుకు మండల కాంప్లెక్స్‌లోని గ్రామ సచివాలయం–4 భవనాన్ని కేటాయించారు. ఈ భవనంలో కోర్టు అవసరాలకు అనుగుణంగా జరుగుతున్న మార్పులను మన్మథరావు పరిశీలించి అధికారులకు పనులు త్వరగా చేయాలని సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి, కందుకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కే శోభారాణి, ఇన్‌చార్జ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భరత్ చంద్ర, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, తహశీల్దార్ టీ రవి, సీఐ సీహెచ్ హజరత్తయ్య, న్యాయవాదులు సన్నెబోయిన శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీహరి, ఆర్అండ్‌బీ ఏఈ మాధవరావు పాల్గొన్నారు.

- జిల్లాలో చాపకింద నీరులా ఎయిడ్స్ భూతం
- పశ్చిమ ప్రకాశంలో 10 వేల మందికిపైగా బాధితులు
- అధికారికంగానే 6,410 మంది నమోదై చికిత్స పొందుతున్న వైనం
- అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం




# అవగాహనే ఆయుధం


మార్కాపురం జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్

మార్కాపురం: జిల్లాలో చాపకింద నీరులా ఎయిడ్స్ వ్యాప్తి చెందుతోంది. ప్రధానంగా పశ్చిమ ప్రకాశంలో పలువురి జీవితాలను కబళిస్తోంది. అవగాహన లోపంతో అనేక మంది ఎయిడ్స్‌బారిన పడి జీవితాలను అర్ధంతరంగా ముగిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరుపుకుంటూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ.. జిల్లాలో ఎయిడ్స్ బాధితుల సంఖ్య వేలల్లోనే ఉంటోంది.

**మార్కాపురం వైద్యశాలలో 6,410 మంది బాధితులు నమోదు...**

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం జిల్లా వైద్యశాలలో ఉన్న ఏఆర్‌టీ సెంటర్‌లో అధికారికంగా 6,410 మంది హెచ్‌ఐవీ బాధితులు నమోదై ఉన్నారు. విజయవాడ, గుంటూరు, ఒంగోలు వెళ్లి చికిత్స చేయించుకునే వారి సంఖ్య మరో 4 వేలకు పైగా ఉంటుంది. కేవలం పశ్చిమ ప్రకాశంలోనే 10 వేల మందికిపైగా బాధితులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా మొత్తంమ్మీద ఈ సంఖ్య 25 వేలకుపైనే ఉండే అవకాశం ఉంది. సురక్షితం కాని శృంగారం, ఇన్‌ఫెక్టెడ్ నీడిల్స్, ఇన్‌ఫెక్టెడ్ రక్తాన్ని మరొకరికి ఎక్కించడం, గర్భిణీ స్త్రీ నుంచి బిడ్డకు వ్యాప్తి చెందడం, నవజాత శిశువుకు హెచ్‌ఐవీ బారిన పడిన తల్లి పాలివ్వడం వంటి వాటి వలన ఎయిడ్స్ వ్యాపిస్తోంది. ఈ విధమైన కారణాలతో జిల్లాలో, ప్రధానంగా పశ్చిమ ప్రకాశంలో హెచ్‌ఐవీ వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

**పశ్చిమ ప్రకాశంలో మండలాల వారీగా ఎయిడ్స్ బారినపడి మందులు వాడుతున్న వారి సంఖ్య ఇలా...**

| మండలం | బాధితులు |
|---|---|
| మార్కాపురం | 916 |
| అర్ధవీడు | 141 |
| కంభం | 241 |
| బేస్తవారిపేట | 273 |
| దోర్నాల | 288 |
| గిద్దలూరు | 541 |
| దొనకొండ | 314 |
| కొమరోలు | 219 |
| కొనకనమిట్ల | 159 |
| కురిచేడు | 217 |
| పెద్దారవీడు | 219 |
| పుల్లలచెరువు | 319 |
| త్రిపురాంతకం | 451 |
| యర్రగొండపాలెం | 429 |
| తర్లుపాడు | 272 |
| రాచర్ల | 193 |

**ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స...**

మార్కాపురం పట్టణంలోని ఏఆర్‌టీ సెంటర్లో చికిత్స పొందుతున్న 6,410 మంది బాధితులు కాకుండా హైదరాబాదు, విజయవాడ, ఒంగోలు, గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న వారు సుమారు 4 వేల మందికిపైగా ఉండొచ్చని అంచనా. మార్కాపురం డివిజన్ నుంచి వందలాది మంది కూలీలు కుటుంబాలకు దూరంగా ఉపాధి కోసం వెళ్లడం ఈ ప్రాంతంలో ఎయిడ్స్ వ్యాప్తికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది 20 నుంచి 40 సంవత్సరాల్లోపు వారే కావడం గమనార్హం. గిద్దలూరు, కొమరోలు, కంభం ప్రాంతాల్లో పలువురు సైనికోద్యోగులు కూడా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులందిస్తోంది. ఈ మందులు వారి జీవితకాలాన్ని పొడిగిస్తుండగా, ఇటీవల కాలంలో చికిత్స తీసుకోకుండా పలువురు మృతి చెందినట్లు కూడా తెలుస్తోంది.

**అవగాహనతోనే నివారణ సాధ్యం**



హ్యూమన్ ఇమ్యునో డెఫిసియన్సీ వైరస్ (హెచ్‌ఐవీ)ని అవగాహనతోనే నివారించాలి. దీనిని గుర్తించడానికి ఏఆర్‌టీ సెంటర్‌లో కొంబెడ్స్, ట్రైలైన్, ట్రిస్పాట్ పరీక్షలు నిర్వహిస్తాం. వాటిలో పాజిటివ్ వస్తే హెచ్‌ఐవీగా నిర్ధారిస్తారు. అనంతరం సీడీ-4 టెస్టులలో తెల్ల రక్తకణాల సంఖ్య 350 కంటే తక్కువగా ఉంటే వారికి జీవిత కాలం పాటు ప్రతి నెలా ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తోంది. గర్భిణులకు హెచ్‌ఐవీ ఉంటే వారికి పుట్టబోయే బిడ్డకు కూడా సంక్రమించే అవకాశం ఉంది. దీర్ఘకాల విరేచనాలు, జ్వరం, ఎడతెరిపిలేని దగ్గు, చర్మవ్యాధులు, గొంతు నొప్పి ఎక్కువ రోజులు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. నెల రోజుల్లో శరీర బరువులో 10 శాతం తగ్గినా, తరచూ జ్వరం, వీరేచనాలు వచ్చినా హెచ్‌ఐవీ టెస్టులు చేయించుకోవాలి. హెచ్‌ఐవీ నివారణ కోసం స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఇటీవల మెరుగైన మందులు సరఫరా చేస్తోంది. ఈ మందులు వాడటం వలన వ్యాధిగ్రస్తుల లైఫ్‌టైమ్ పెరగడమే కాకుండా సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా చేస్తుంది. మందులు మధ్యలో మానేసిన వారు తరచూ అనారోగ్యాల బారినపడి మరణిస్తున్నారు. మందులు క్రమం తప్పకుండా వాడితే దీర్ఘకాలంగా ఆరోగ్యంగా ఉంటారు.

– డాక్టర్ సీహెచ్ సాయికిరణ్, ఏఆర్‌టీ సెంటర్, మార్కాపురం జీజీహెచ్

**పలు మండలాల్లో పెరుగుతున్న కేసులు...**

జిల్లాలోని మార్కాపురం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, అర్ధవీడు, కంభం, మండలాల్లో హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో శాశ్వతమైన నీటి వనరులు, ఫ్యాక్టరీలు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు సంవత్సరంలో 8 నెలల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, చెన్నై, బెంగళూరుకు కుటుంబాలను వదిలి ఉపాధి కోసం వెళ్తుంటారు. ఇది వారికి శాపంగా మారుతోంది. మార్కాపురం జిల్లా వైద్యశాలలోని యాంటీ రెట్రో వైరల్ ట్రీట్‌మెంట్ (ఏఆర్‌టీ) సెంటర్‌లో నమోదైన వివరాలను పరిశీలిస్తే హెచ్‌ఐవీ శరవేగంగా వ్యాపిస్తూ పలువురి ప్రాణాలను బలికొంటున్నట్లు తెలుస్తోంది. ఎక్కువగా ఆటో, లారీ డ్రైవర్లు, వలస కూలీలు, పలకల కార్మికులు ఈ మహమ్మారి బారిన పడుతున్నారు.

**జిల్లాలో హెచ్‌ఐవీ నిర్ధారణ కేంద్రాలు**

మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, ఒంగోలు, యర్రగొండపాలెం, కంభం, పొదిలి, దర్శి, సింగరాయకొండలో ఉన్నాయి.
మార్కాపురం, ఒంగోలులో ఏఆర్‌టీ సెంటర్లు ఉన్నాయి.

# అక్రమ కేసులు బనాయించడం సరికాదు

- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


సీఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ వర్గీయులపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. వైఎస్సార్ సీపీ వర్గీయుడు, విద్యుత్ కాంట్రాక్టర్ మోర్తాల సుబ్బారెడ్డి తాను చేస్తున్న కాంట్రాక్ట్‌ను వదులుకోకపోవడంతో ఆయనపై కేసులు బనాయించారు. ఈ సంఘటపై శనివారం యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ సీహెచ్ ప్రభాకరరావుతో చర్చించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం యర్రగొండపాలెంలోని ఎస్‌పీఎం ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్‌ను సుబ్బారెడ్డికి కేటాయించిందని తెలిపారు. అగ్రిమెంట్ ప్రకారం మరో రెండు సంవత్సరాల వరకు ఆయనకు కాంట్రాక్ట్ పనులు చేసే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ వర్గీయులకు ఆ పనులు అప్పజెప్పాలన్న ఉద్దేశంతో సుబ్బారెడ్డిపై అరాచకాలకు దిగిందని తెలిపారు. ఆ మేరకు విద్యుత్ శాఖాధికారులు కాంట్రాక్ట్ వదులుకోవాలని, లేకుంటే ఇబ్బంది పడతావని బెదిరిస్తూ వచ్చారన్నారు. అందుకు సుబ్బారెడ్డి ఒప్పుకోకపోవడంతో విద్యుత్ అధికారులు కూటమి నాయకులు చెప్పినట్లు కేసులు పెట్టారని ఎమ్మెల్యే వివరించారు. ఇటువంటి కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. పుల్లలచెరువులో ఒక షిఫ్ట్ ఆపరేటర్‌పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని, ఆ పోస్టును రూ.15 లక్షలకు అమ్ముకున్నారని ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గంలో రాజ్యాంగ వ్యతిరేక శక్తులు తయారయ్యాయని, ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ విధంగా వేధింపులకు దిగితే ప్రజా ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, ఏకుల ముసలారెడ్డి, సత్తిరెడ్డి, కోటిరెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారు.

# ప్రమాదానికి గురైన యువకుడిని ఆదుకోవాలి

- క్విస్ కాలేజీ బస్సును అడ్డుకున్న మైనంపాడు గ్రామస్తులు
- పోలీసుల చర్చలతో ఆందోళన విరమణ


క్విస్ కాలేజీ బస్సును అడ్డుకుని ఆందోళన చేస్తున్న మైనంపాడు గ్రామస్తులు


క్విస్ కాలేజీ బస్సు ఢీకొని గాయపడి చికిత్స పొందుతున్న ఖాదర్ బాషా

సంతనూతలపాడు: స్థానిక క్విస్ కాలేజీ బస్సు ఢీకొని ప్రమాదానికి గురైన యువకుడిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు గ్రామస్తులు శనివారం ఆ కాలేజీ బస్సును అడ్డుకున్నారు. మైనంపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ బాషా (26) అనే నిరుపేద కుటుంబానికి చెందిన కార్మికుడిని నాలుగు రోజుల క్రితం చీమకుర్తి సమీపంలో క్విస్ కళాశాల బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలులోనే ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరిలోని ఎన్నారై హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాషా పరిస్థితి విషమంగానే ఉంది. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. క్విస్ కళాశాల యాజమాన్యం ఆదుకోకపోగా, కనీసం స్పందించకపోవడంతో మైనంపాడు గ్రామస్తులు శనివారం ఆ గ్రామం మీదుగా వస్తున్న క్విస్ కాలేజీ బస్సును అడ్డుకుని ఆందోళనకు దిగారు. కళాశాల బస్సు ఢీకొని గాయపడిన బాషాను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు మైనంపాడు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబుకు సమాచారం అందించారు. బాధితుడికి న్యాయం చేసేందుకు కళాశాల యాజమాన్యంతో మాట్లాడనున్నట్టు ఆందోళనకారులకు ఎస్సై తెలిపారు. దీంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

## గ్రానైట్ లారీలు పట్టివేత

చీమకుర్తి రూరల్: మైనింగ్ బిల్లులు లేకుండా అక్రమంగా గ్రానైట్ ముడిరాళ్లు రవాణా చేస్తున్న లారీలను గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. రామతీర్థం ప్రాంతంలో శనివారం ఆకస్మికంగా దాడులు చేశారు. మైనింగ్ బిల్లులు లేకుండా గ్రానైట్ స్లాబులను కేరళకు రవాణా చేస్తున్న లారీతో పాటు గ్రానైట్ ముడిరాళ్లతో చెన్నై వెళ్తున్న లారీని పట్టుకుని ఏపీఎండీసీ ప్రాంగణానికి తరలించారు.


మైనింగ్ అధికారులు పట్టుకున్న లారీ

# ప్రశాంతంగా పోలీసు బదిలీలు


కౌన్సిలింగ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లాలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న పలువురు ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 195 మందిని బదిలీ చేశారు. శనివారం జిల్లా పోలీసు కళ్యాణ మండపంలో సిబ్బందికి బదిలీల కౌన్సిలింగ్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ నిర్వహించారు. సీనియార్టీ ఆధారంగా ఒక్కొక్కరిని పిలిచి విల్లింగ్ తీసుకున్నారు. గతంలో పనిచేసిన పోలీసు స్టేషన్, స్వగ్రామం, ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్ పరిధిలో కాకుండా ఇతర ఖాళీలను స్క్రీన్ మీద ప్రదర్శించారు. కౌన్సిలింగ్‌లో ఆధునిక సాంకేతికతను వినియోగించారు. కౌన్సిలింగుకు హాజరైన సిబ్బందికి ఎదురుగా ఒకవైపు పోలీసు స్టేషన్ల ఖాళీల వివరాలు, రెండోవైపు స్క్రీన్ మీద కోరుకుంటున్న పోస్టింగు వివరాలు, సదరు ఉద్యోగికి సంబంధించిన సర్వే వివరాలు ప్రదర్శించారు. అక్కడికక్కడే బదిలీ ఉత్తర్వులు, డీఓ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒకే చోట ఐదేళ్లపాటు విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు బదిలీ అనేది కొందరికి బాధగా ఉంటే.. మరికొందరికి ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. ఎక్కడ విధులు నిర్వర్తించినా క్రమశిక్షణతో పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, డీపీఓ ఏఓ రామ్మోహనరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, రమేష్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### తొలిరోజు 93 శాతం పింఛన్ల పంపిణీ


వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ, ఎమ్మెల్యేలు

ఒంగోలు వన్‌టౌన్/ఒంగోలు సబర్బన్: జిల్లాలో శనివారం మొదటిరోజు సామాజిక పెన్షన్ల పంపిణీని 93 శాతం పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 2,86,034 మంది పెన్షన్‌దారులు ఉండగా, 2,66,215 మందికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర తెలిపారు. ఒంగోలు నగరంలోని రామ్‌నగర్‌లో వృద్ధురాలికి రాష్ట్ర మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పింఛన్ అందజేసి పంపిణీని ప్రారంభించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు యాదవుల కార్తీక వనభోజనాలు

మద్దిపాడు: కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్‌లో యాదవ సామాజికవర్గం కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సామాజికవర్గ నాయకుడు అడక స్వాములు తెలిపారు. యాదవులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

### గుర్తు తెలియని వృద్ధుడు మృతి

చీమకుర్తి: గుర్తు తెలియని వృద్ధుడు చీమకుర్తి బస్టాండ్‌లో మృతి చెందినట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. మృతుడి వయసు సుమారు 85 సంవత్సరాలు ఉంటుందన్నారు. అతని వద్ద రెండు ఓపీలు, మందులు ఉండటంతో అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మోసానికి బ్రాండ్ అంబాసిడర్.. చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్


కుప్పం ప్రసాద్

ఒంగోలు సిటీ: ఎన్నేళ్లు గడిచినా నమ్మిన వారిని, నమ్మి ఆదరించిన వారిని మోసం చేయడంలో చంద్రబాబుకి ఎవరూ సాటి రారని ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ అన్నారు. ఒంగోలులో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. దగా చేయడం, వంచించడం, నిట్టనిలువునా ముంచడంలో డబుల్, ట్రిపుల్ పీహెచ్‌డీలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన విషయం అందరికీ తెలుసన్నారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు శుష్క వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాడన్నారు. కరెంట్ చార్జీలు పెంచనని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఆరు నెలలు గడవక ముందే రెండుసార్లు ట్రూఅప్ చార్జీలు పెంచి తన నిజస్వరూపాన్ని మరోసారి బట్టబయలు చేశారన్నారు. సూపర్‌సిక్స్ హామీలను ఎప్పుడో అటకెక్కించి ఎడాపెడా కరెంట్ చార్జీలు పెంచుతూ ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నాడన్నారు. ఇప్పటికే నిత్యావసరాలు, ఇతర ధరలు పెరిగి ప్రజలు అల్లాడుతుంటే ఇష్టం వచ్చినట్లు కరెంట్ చార్జీలు పెంచడం ఏంటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అటు సంక్షేమ పథకాలు అందక, ఇటు భారీగా పెరిగిన ధరలతో ప్రజలు ఆర్థికంగా చితికిపోతూ అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితులు దాపురించాయని మండిపడ్డారు. చంద్రబాబు పాలనతో ప్రజలు మళ్లీ అప్పులు చేసేందుకు కాల్‌మనీ గ్యాంగులను ఆశ్రయించే పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. తాను ఇచ్చిన హామీలు అబద్ధమని, అధికారంలోకి రావడానికి తాను మాయమాటలు చెప్పానని చంద్రబాబు తన ముక్కు నేలకు రాసి ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజులు సమీపంలోనే ఉన్నాయని కుప్పం హెచ్చరించారు.

# సీటు ఇప్పిస్తానంటూ డబ్బు తీసుకున్నారు

ఒంగోలు టౌన్: గత అసెంబ్లీ ఎన్నికల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యే సీటు ఇప్పిస్తానంటూ బాపట్ల జిల్లా చినగంజాం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి తన నుంచి రూ.25 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఆరోగ్యశ్రీ మాజీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్ బాబు శనివారం ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి, జనసేన నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి కుమారుడు ప్రణీత్‌రెడ్డితో మాట్లాడి సీటు ఇప్పిస్తానంటూ ఎంపీపీ కోమట్ల నమ్మబలికాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల్లో సీటు రాకపోయేసరికి తన దగ్గర తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగేందుకు అంకమ్మరెడ్డి దగ్గరకు వెళితే కులం పేరుతో దూషిస్తున్నాడన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు. యాదాల ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరుపుతున్నామని తాలూకా సీఐ అజయ్ కుమార్ తెలిపారు.

**అంతా అబద్ధం : ఎంపీపీ కోమట్ల**

ఒంగోలు సబర్బన్: డాక్టర్ యాదాల అశోక్ బాబు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని చినగంజాం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి ఖండించారు. శనివారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంతనూతలపాడు అసెంబ్లీ టికెట్ ఇప్పిస్తానని తాను మధ్యవర్తిగా ఉండి డబ్బు తీసుకున్నానని అశోక్‌బాబు అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్నారు. తనకు – అశోక్‌బాబుకు మధ్య భూ వ్యాపార లావాదేవీలు తప్ప ఎటువంటి రాజకీయ వ్యవహారాలు లేవని స్పష్టం చేశారు. ఆయనకు–తనకు ఉన్న వ్యాపార లావాదేవీలలో బాలినేని కుటుంబాన్ని లాగడం సరైన పద్ధతి కాదన్నారు. బాలినేని ప్రణీత్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అశోక్‌బాబు, తాను కలిసి రూ.25 లక్షలు పెట్టి ఇసుక ల్యాండ్ కొన్నామని, ఆ ల్యాండ్ తాలూకా తనకు రూ.18 లక్షలు అశోక్‌బాబు ఇచ్చారని చెప్పారు. పొలం కొన్న తర్వాత కొన్నిరోజులకు ఇసుక సీనరేజ్ జేపీ వాళ్లకు ఇవ్వడంతో తన డబ్బు వెనక్కు ఇవ్వాలని అశోక్‌బాబు కోరారన్నారు. తనకు ఇచ్చిన రూ.18 లక్షల్లో రూ.10 లక్షలు ఇచ్చానని, మిగిలిన రూ.8 లక్షలు ఇస్తానని చెప్పానని వివరించారు. అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. ఇదంతా తాలూకా సీఐకి చెప్పానన్నారు. సివిల్ వ్యవహారం కావడంతో మీరు బయటే సెటిల్ చేసుకోవాలని తాలూకా సీఐ చెప్పడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే టికెట్ ఇప్పించే స్థాయి తనది కాదని, ఎమ్మెల్యేగా పోటీ చేసే స్థాయి అతనిది కాదని ఎంపీపీ కోమట్ల అన్నారు.

# మాయ లేడీలు

- పట్టపగలు మెడికల్‌షాపులో చోరీ

సింగరాయకొండ: పట్టపగలు ముగ్గురు మాయ లేడీలు చోరీ చేసిన ఘటన శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని అపోలో ఫార్మసీ మెడికల్ షాపులో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. మెడికల్ షాపునకు మొదట ఒక మహిళ వచ్చింది. ఆ తరువాత ఇద్దరు వచ్చారు. ఆ సమయంలో షాపులో సేల్స్‌మెన్ కె. కోటేశ్వరమ్మ మాత్రమే ఉన్నారు. మొదట వచ్చిన మహిళ తనకు కావాల్సిన వస్తువులు కోటేశ్వరమ్మకు చెపుతుండగా ఆమె లిస్టు రాసుకుంటోంది. ఈ సమయంలో మిగతా ఇద్దరు తమ పని ప్రారంభించారు. విలువయిన హెయిర్ ఆయిల్, సెంటు బాటిల్స్, ఫేస్ క్రీములు సర్దే పనిలో ఉన్నారు. వీరిద్దరు జాకెట్లో, చీరెలో వాటిని దాచిపెట్టారు. ఈ క్రమంలో ఒక మహిళ హార్లిక్స్ డబ్బా తీసుకుని వెళ్లే ప్రయత్నంలో సేల్స్‌మెన్ కోటేశ్వరమ్మ జరుగుతున్న విషయాన్ని గమనించి కేకేయటంతో ఎఅల్మరాలో పెట్టింది. తరువాత కోటేశ్వరమ్మ ఆ మహిళను పట్టుకుని తనిఖీ చేయగా ఆమె వద్ద సుమారు 800 రూపాయల విలువ గల వస్తువులు దొరికాయి. ఈలోగా మిగిలిన ఇద్దరు మహిళలు చల్లగా జారుకున్నారు. తరువాత ఈ మహిళ కూడా కోటేశ్వరమ్మను ఏమార్చి వెళ్లిపోయింది. తరువాత కోటేశ్వరమ్మ విషయాన్ని తన యజమానులకు తెలపటంతో వారు సీసీ టీవీ ఫుటేజ్ చూడటంతో ముగ్గురు మాయ లేడీల బండారం బట్టబయలైంది. వీరు ముగ్గురు దర్జాగా వచ్చి దర్జాగా చోరీ చేసి వెళ్లారని ఒకరి వద్ద మాత్రమే చోరీ సొత్తు దొరికిందని.. విలువ సుమారు 2 వేల రూపాయలు ఉంటుందని సిబ్బంది వివరించారు. ఈ చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిబ్బంది తెలిపారు.